

**అతీగతీ లేదని అర్జీదారుల ఆవేదన**

కలెక్టరేట్‌లో సమర్పిస్తున్న వినతులకు అతీగతీ లేకుండా పోయిందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



**రమణీయం.. రథోత్సవం**

కార్వేటినగరంలో శ్రీవేణుగోపాలస్వామివారు రుక్మిణి, సత్యభామ సమేతంగా రథంపై పురవీధుల్లో ఊరేగారు. - 8లో



**పొట్టకొట్టారు.. వీధిలోకి నెట్టారు!**

కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ఎండీయూ వాహనాలు నిలిపేస్తోందని ఆపరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో

## న్యూస్‌రీల్

### 7 నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు



శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

**వడమాలపేట (విజయపురం) :** వడమాలపేట మండల అప్పలాయిగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 6న అంకురార్పణ జరిపించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవదేవేరులు విశిష్ట వాహనాల్లో విహరించనున్నట్లు చెప్పారు. 10వ తేదీ నిర్వహించే శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు రూ.500లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

### మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ తప్పనిసరి

**యాదమరి:** మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్‌ను రెండేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన యాదమరి ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ చేశారు. హనుమంతరావు మాట్లాడుతూ టీకా వేసుకోని వారిని గుర్తించాలని, జూలైలోపు వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక డ్రైవ్ వ్యాక్సినేషన్‌కు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### వరసిద్ధుని సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ అరుణకు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఈఓ పెంచల కిషోర్

**కాణిపాకం:** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందేష్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ సారిక వేర్వేరుగా సేవించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈఓ పెంచల కిషోర్ తీర్థప్రసాదాలతోపాటు స్వామివారి చిత్రపటం అందించారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 91,538 మంది స్వామివారిని దర్శించుకోగా 37,339 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



- మద్యం అమ్మకాలపై 'పచ్చ' పన్ను
- ఒక్కో వైన్‌షాపు నుంచి రూ.30 వేలు వసూలు
- కలెక్షన్ ఏజెంట్లుగా ఎక్సైజ్ అధికారులు
- ఇష్టారాజ్యంగా దుకాణదారులకు అనుమతులు
- అధిక ధరలతోపాటు రాత్రింబవళ్లు విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్

జిల్లాలోని వైన్‌షాపుల యజమానులతో కూటమి నేతలు ఒప్పందం కుదుర్చుకున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా అనధికారికంగా 'పచ్చ' పన్ను విధించారు. రాత్రింబవళ్లు మద్యం విక్రయాలు సాగించుకునేందుకు అనుమతులు మంజూరు చేసేశారు. ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముకునేందుకు 'పచ్చ' జెండా ఊపేశారు. ఇందుకోసం ఒక్కో దుకాణం నుంచి ప్రతి నెలా రూ.30వేలు చెల్లించాలని నిబంధన అమలు చేస్తున్నారు. ముడుపుల వసూలు బాధ్యతను ఘనత వహించిన ఎక్సైజ్ అధికారులకే అప్పగించారు. ప్రతిష్టాత్మక ఖాకీలను కలెక్షన్ ఏజెంట్లుగా మార్చేశారు.



# కూటమికే కిక్

**చిత్తూరు అర్బన్:** జిల్లాలో గత ఏడాది అక్టోబర్‌లో కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకువచ్చింది. అప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి, ప్రైవేటు షాపులకు పగ్గాలు అప్పగించింది. కేవలం కూటమి పార్టీ నేతలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ప్రైవేటు మద్యం దుకాణాలకు తొలుత 20 శాతం లాభాలు వస్తాయని పాలసీ సమయంలో ప్రభుత్వం ప్రకటించింది. ఆపై దుకాణాలు దక్కించుకున్న తమ వారికి లాభం చేకూర్చేలా ప్రణాళిక రచించింది. ల్యాండింగ్‌కాస్ట్‌లో 20 శాతం లాభాలు చూపించినా, తమకు వాస్తవానికి అంత మొత్తం రావడంలేదని వ్యాపారులు చెప్పడంతో.. హుటాహుటిన ఇతర పన్నులు తగ్గించి, మరో 4 శాతం దుకాణదారుల జేబుల్లోకి వెళ్లేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదునుగా జిల్లాలోని కూటమి నేతలు రంగంలోకి దిగారు. ప్రతి మద్యం దుకాణంలో అమ్మకాలపై «పచ్చ» పన్ను చెల్లించాల్సిందేనంటూ పట్టుబట్టారు. తొలి దఫాలో నోటిఫికేషన్‌లో 104 దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులతో పాటు, ఈ ఏడాది కల్లుగీత సామాజిక వర్గాలకు ఇచ్చిన పది షాపుల నుంచి కూడా మామూళ్ల వసూలు చేయడం మొదలుపెట్టారు.

**ప్రతి నెలా రూ.అర కోటి వరకు**

జిల్లాలోని 114 ప్రైవేటు మద్యం దుకాణాలు, 8 బార్ల నుంచి కూటమి నేతలు నెలసరి మామూళ్ల వసూలు చేస్తున్నారు. అది కూడా వాళ్ల చేతికి ఏమాత్రం మట్టి అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక్కో మద్యం దుకాణం నుంచి నెలకు రూ.30 వేలు చొప్పున, బార్ నుంచి నెలకు రూ.20 వేలు చొప్పున.. మొత్తంగా నెలకు రూ.అర కోటి వరకు పచ్చ పన్ను వసూలు చేస్తున్నారు. ఇందులో ప్రతి నియోజకవర్గంలోని కూటమికి చెందిన ప్రధాన నాయకుడికి 70 శాతం, మద్యం దుకాణం పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు 10 శాతం, 20 శాతం ఎక్సైజ్ అధికారులకు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. మొత్తం వసూలు ప్రక్రియ కోసం ఆబ్కారీశాఖలోని కొందరు సిబ్బందిని కలెక్షన్ ఏజెంట్లు నియమించుకున్నారనే విమర్శలున్నాయి. మళ్లీ ఇందులో ఆబ్కారీ శాఖకు చెందిన ఓ అధికారికి ఒక్కో దుకాణానికి నెలకు రూ.4 వేలు, మరో అధికారికి రూ.2 వేలు వాటా ఇవ్వాల్సిన బాధ్యత కూడా ఆ శాఖ సిబ్బందే చూసుకోవాలి. అయితే స్టేషన్ నిర్వహణ, సారా నిర్మూలన పేరిట తనిఖీలకు వెళ్లేప్పుడు వాహనాలకు డీజిల్ నింపుకోవడానికి కూడా ఏమీ మిగలడంలేదని కొందరు అధికారులు నిట్టూరుస్తుండడం గమనార్హం.



చిత్తూరులో వైన్‌షాపునకు పక్కనే అనధికారిక పర్మిట్‌రూమ్‌లు

**ఇక అంతా మీ ఇష్టం**

దుకాణాల నుంచి మామూళ్ల వసూలు చేస్తున్న అధికారులు.. దానికి ప్రతిఫలంగా వ్యాపారులకు కొన్ని వెలుసుబాట్లు కూడా కల్పించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరచి ఉంచాల్సిన మద్యం షాపులను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచుకునే అవకాశమిస్తున్నారు. ఇక ఉదయం 10 గంటలకు తెరవాల్సిన బార్లను తెల్లవారుజాము 5 గంటలకే తెరచి, అర్ధరాత్రి వరకు విక్రయాలు చేసుకునేందుకు అనధికారిక అనుమతులు ఇచ్చేశారు. అనధికార పర్మిట్ గదులు వందల సంఖ్యలో ఉన్నా అధికారులు పట్టించుకోకుండా, ఇక అంతా మీ ఇష్టం అంటూ వ్యాపారులకు పూర్తి సహకారం అందిస్తున్నారు. ఇటీవల తిరుపతిలో 24 గంటల పాటు మద్యం దుకాణాలు తెరచి ఉంచిన వైనాన్ని 'సాక్షి'పత్రిక ఎండగట్టడంతో.. మేల్కొన్న అధికారులు, ముందస్తు సమాచారం ఇచ్చి మరీ సమయపాలన తనిఖీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీనితోడు చాలా దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా వైన్‌షాపుల వారు క్వార్టర్ బాటిల్‌పై రూ. 10 నుంచి రూ. 20 వరకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. బెల్టుషాపు పేరిట బాటిల్ మద్యంపై రూ. 30 నుంచి రూ. 50 వరకు, అర్ధరాత్రి దాటక రూ.50 నంచి రూ.100వరకు ఎక్కువ రేటుకు విక్రయాలు సాగిస్తున్నారు.



ఇటీవల చిత్తూరులో మద్యం దుకాణం సమయ పాలనను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

### అందుబాటులో రూ.100 స్టాంప్ పేపర్లు

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ రూ.100 స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉంచామని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. ఇన్ని రోజులు ఈ పేపర్లు స్థానికంగా నిల్వలేవని, ప్రస్తుతం వాటిని అందజేశామన్నారు. చిత్తూరు అర్బన్‌లో 7,000, చిత్తూరు రూరల్‌లో 4,000, బంగారుపాళ్యంలో 3,000, పలమనేరులో 6,000, పుంగనూరులో 5,000, కుప్పంలో 6,000, కార్వేటినగరంలో 3,000 కలిపి మొత్తం 40,000 స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉంచామన్నారు. అదే విధంగా స్పెషల్ ఎడిషన్ స్టాంప్స్ కూడా అన్ని కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### కొనుగోలుకు చం'దూరం'



**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు మామిడి కాయల మార్కెట్‌లో చందూర రకం మామిడిని అడిగేవారు లేరు. మ్యాంగో గుజ్జు ఫ్యాక్టరీలు కూడా చందూరను కొనుగోలు చేయడం లేదు. కేవలం అల్ఫోన్సోను మాత్రమే కొంటున్నాయి. దీంతో చందూర కొనుగోలుకు ట్రేడర్లు మొగ్గుచూపడం లేదు. ప్రస్తుతం చిత్తూరు నగరంలోని మామిడి కాయల మార్కెట్‌కు ప్రస్తుతం టేబుల్ రకాలైన బేనీషా, చందూర, అల్ఫోన్సో వంటివి మాత్రమే జోరుగా వస్తున్నాయి. ఇందులో అల్ఫోన్సోకు మాత్రమే డిమాండ్ ఉంది. మిగిలిన రకాల ధరలు క్షీణిస్తున్నాయి. బేనీషా రెండు రోజులకు కిత్రం కేజీ రూ.20 ఉంటే ..సోమవారం రూ.15లకు పడిపోయింది. తోతాపురిలో టేబుల్ రకం రూ.12 నుంచి రూ. 10లకు చేరింది. అల్ఫోన్సో మాత్రం తొలి నుంచి కూడా రూ.25 పలుకుతోంది. ఇక చందూర కేజీ రూ.8లకు పడిపోయింది. ఫ్యాక్టరీ వాళ్లు చందూరను వద్దంటున్నారని ట్రేడర్లు సైతం ముఖం చాటేస్తున్నారు. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

### ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన

**కుప్పం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటన ముగించుకుని సోమవారం విజయవాడకు తిరుగు ప్రయాణ మయ్యారు. శాంతిపురం మండలం శివపురం వద్ద నిర్మించిన నూతన గృహప్రవేశం తర్వాత ఉదయం 11 గంటలకు ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలోని ఇందిరా గాంధీ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు రోడ్డు మార్గాన చేరుకున్నారు. అనంతరం హెలిక్యాప్టర్‌లో బెంగళూరు చేరుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ కంచెర్ల శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.



హెలీప్యాడ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

### వ్యాక్సిన్‌పై అవగాహన ర్యాలీ

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద సోమవారం మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ సుధారాణి మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌పై ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా అర్హులైన పిల్లలను గుర్తించి టీకాలు వేస్తామని వెల్లడించారు. ఈ డ్రైవ్‌ను బాధ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఐఓ హనుమంతరావు పాల్గొన్నారు.

### హెచ్‌ఎం కేడర్ బదిలీలకు 210 దరఖాస్తులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ప్రధానోపాధ్యాయుల కేడర్ బదిలీలకు 210 దరఖాస్తులు అందాయి. అందులో రెండు దరఖాస్తులను వివిధ కారణాలతో విద్యాశాఖ అధికారులు తిరస్కరించారు. మిగిలిన 208 దరఖాస్తులను ఆమోదించారు. హెచ్‌ఎం కేడర్‌లో 181 ఖాళీలను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో జెడ్పీ కింద 155, ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో 10, మున్సిపల్ కార్పొరేషన్‌లో 9, మున్సిపాలిటీల్లో 7 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసిన ఖాళీల ఆధారంగా హెచ్‌ఎంలు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా బదిలీల ఉత్తర్వులను ఆన్‌లైన్‌లోనే జారీచేయనున్నారు.

**నేడు ఉద్యోగోన్నతులకు పరిశీలన**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్‌లకు సంబంధించి సీనియారిటీ జాబితా ప్రకారం మంగళవారం ఉద్యోగోన్నతులకు సంబంధించి సర్టిఫికెట్‌లు పరిశీలించనున్నారు. చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రేడ్ 2 హెచ్‌ఎం పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్, డీవైఈఓ, ఎంఈఓలకు పంపినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు.

# కలసికట్టుగా పోరుబాట

- హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ కార్యాచరణ
- అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు
- అధినేత ఆదేశాల మేరకు సమావేశమైన పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు
- 4న 'వెన్నుపోటు దినం' పాటించాలని పిలుపు

**సాక్షి ప్రతినిధి, తిరుపతి :** ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని పక్కనపెట్టి అక్రమ కేసులు, అరెస్టులు, దాడులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి ప్రభుత్వంపై కలసికట్టుగా పోరుబాట పట్టాలని వైఎస్సార్‌సీపీ నేతలు సంకల్పించారు. ఈ మేరకు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశారు. సోమవారం తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పరిశీలకులు, ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, తిరుపతి, చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి, చావా రాజశేఖరరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, నియోజకవర్గాల సమన్వయకర్తలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్, విజయానంద రెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, వెంకటేగౌడ, భరత్‌కృష్ణ, రాష్ట్ర అధికారప్రతినిధి శివశంకరరెడ్డి హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ దగాకోరు విధానాలకు నిరసనగా జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం పాటించాలని, ఈ మేరకు కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.



వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశంలో భూమన , పెద్దిరెడ్డి, రఘునాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, రోజా, రెడ్డెప్ప, విజయానందరెడ్డి, భరత్, వెంకటేగౌడ, సునీల్‌కుమార్ తదితరులు

**వెన్నుపోటు దినం.. విజయవంతం చేద్దాం**

'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నేతలు పకడ్బందీ కార్యాచరణ రూపొందించారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ల వద్ద చేపట్టే నిరసనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు,, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వ అసమర్థతపై ప్రజా వ్యతిరేకత దశదిశగా ప్రతిధ్వనించేలా కార్యక్రమం నిర్వహించాలని సంకల్పించారు. రాష్ట్రంలోని మహిళలు, రైతులు, యువత, విద్యార్థులను పథకాల పేరుతో మోసం చేసిన చంద్రబాబుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని స్పష్టం చేశఋరు. దగా పడిన జనానికి అండగా నిలిచి పోరాడాల్సిన బాధ్యత తమ మీద ఉందని వెల్లడించారు. అందుకే ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని, సామాన్య ప్రజలను సైతం భాగస్వాములు చేయాలని సూచించారు.

**ప్రతిఘటిస్తాం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్ చేసుకుని కుట్రలు, కుతంత్రాలతో భయానక వాతావరణాన్ని సృష్టించాలని చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు కార్యకర్తలను సైతం బెదిరిస్తున్నారు. వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అందులో భాగంగానే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీద తప్పుడు కేసులు బనాయించారు. మా పార్టీ నాయకులపై ఎన్ని కేసులు పెడతారో, ఎంతగా బెదిరిస్తారో అంతగా మేం ప్రతిఘటించి ఉద్యమిస్తాం.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు

**కాకాణి అరెస్ట్ అక్రమం**

ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నందుకు రాజకీయ కక్షతోనే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఈ అరెస్ట్ అక్రమం. ఆయన అరెస్టును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ అరెస్టుతో కూటమి ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత పెరిగింది. అధికారం కోసం మామ ఎన్టీఆర్‌ని ఎలా వెన్నుపోటు పొడిచారో.. అదే అధికారం కోసం చంద్రబాబు అలవిగాని హామీలు ఇచ్చి మోసపూరితంగా అధికారంలోకి వచ్చారు. మామను వెన్నుపోటు పొడిచినట్టే.. ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి

**ఆ ధైర్యం ఉందా?**

కూటమి పాలన ఏడాది పూర్తయి మహానాడు నిర్వహించనుందని, ఆ మహానాడులో ఇచ్చిన హామీలు నెరవేర్చాం అని చెప్పే దమ్ముందా?. పచ్చ చానెళ్లతో తప్పుడు ప్రచారాలు, పోలీసులతో వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించడం, నాయకులు, కార్యకర్తలను వేధించడం మినహా చేసిందేమీ లేదు. మద్యం కుంభ కోణం అంటూ నేడు అధికార పార్టీ ఊదరగొట్టడం కూడా హామీలు నెరవేర్చలేదని ప్రజలు ప్రశ్నించకుండా చేసే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, కృష్ణమోహన్, ధనంజయులు రెడ్డిపై కేసులు పెట్టడం చూస్తే ఇవన్నీ రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం పెట్టిన కేసులే అని తెలుస్తోంది. జగనన్న అధికారంలోకి రావడం ఖాయం. అప్పుడు వారికి అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా శిక్షపడేలా చేస్తాం.

– ఆర్‌కే రోజా, మాజీ మంత్రి

### గొప్పలు చెప్పుకుని.. గుట్టుగా జారుకుని!



మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి

**చిత్తూరు కలెక్టరేట్ :** చేసిందేమీ లేకపోయినా...గొప్పలు చెప్పుకునేందుకే మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి జిల్లా పర్యటనకు విచ్చేశారని పలువురు విమర్శలు గుప్పించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సాంఘిక సంక్షేమ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా దళితులకు కూటమి ప్రభుత్వం ఏదో చేసేసినట్లు ఊదరగొట్టారు. స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయనప్పటికీ రూ.కోట్లు విడుదల చేసి దళితులకు మేలు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొంది మాదిగ, మాలలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చిత్తూరు జిల్లాలో 954, తిరుపతి జిల్లాలో 1,267 యూనిట్‌లకు ప్రభుత్వం రూ.92 కోట్లు మంజూరు చేసిందని గొప్పలు చెప్పారు. అయితే రుణాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే మాత్రం నీళ్లు నమిలారు. ఇంతకీ రుణాలు ఎప్పుడిస్తారు అంటే సమాధానం చెప్పకుండా జారుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డీఐజీగా మునిశంకరయ్య

చిత్తూరు కార్పొరేషన్‌: స్టాంప్స్‌ అండ్‌ రిజిస్ట్రేషన్‌ శాఖ మార్కెట్‌ విలువ, ఆడిట్‌ జిల్లా రిజిస్ట్రార్‌ మునిశంకరయ్యకు పదోన్నతి కలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నెల్లూరు జిల్లా డీఐజీగా ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించారు. ఈయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా తిరుపతి జిల్లా రిజిస్ట్రార్‌ శ్రీరామ్‌కుమార్‌ను నియమించారు.

### ఆస్పత్రుల్లో బదిలీలకు కుయుక్తులు

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్‌లో ఐదేళ్లు, మూడేళ్లు దాటిన ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి జిల్లా అధికారులు రెండు రోజుల కిందటే రాష్ట్రస్థాయి అధికారులకు పంపారు. మంగళవారం బదిలీలకు సంబంధించి పూర్తి మార్గదర్శకాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో కొంత మంది ఉద్యోగులు ప్రస్తుతం ఉన్నచోటే పాతుకుపోవాలని కుయుక్తులు పన్నుతున్నారు. ఆస్పత్రుల్లో డ్యూటీలకు ధుమ్మా కొట్టి యూనియన్‌ మీటింగ్‌, ప్రజాప్రతినిధులు, కూటమి నేతల వద్దకు పరుగులు పెడుతున్నారు. ముందుగానే సిఫార్సు లేఖలకు క్యూకడుతున్నారు. దీనికితోడు యూనియన్ల సహకారం ఉంటుందని కొత్త కమిటీకి సై అంటున్నారు. బదిలీలకు సంబంధించి నోటిఫికేషన్‌ వచ్చాక కూడా కమిటీ ఏర్పాటు చేయడంపై కొందరు ఉద్యోగులు భగ్గుమంటున్నారు. అత్యవసరంగా రాత్రి పూట కూడా సమావేశం నిర్వహించి కమిటీ ఏర్పాటు చేయడం సరికాదని వ్యతిరేకిస్తున్నారు. ఇలానే జరిగితే రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేస్తామని, లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెబుతున్నారు.

### కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- వైద్యుడి దుర్మరణం

కోలారు: కర్ణాటకలోని చెన్నై– బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ హైవేపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ వైద్యుడు మృతి చెందారు. వివరాలు.. అనంతపురంలోని ఇందిరానగరకు చెందిన కృష్ణ జగన్‌(24) కుప్పంలోని పీఈఎస్‌ మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ పూర్తి చేసి ఇంటర్న్‌షిప్‌లో ఉన్నారు. ఈ క్రమంలో అనంతపురం వెళ్లిన ఆయన కారులో తిరుగుప్రయాణమయ్యారు. ఉదయం 8.30 గంటల సమయంలో బంగారుపేట తాలూకా సిద్ధనహళ్లి వద్ద టైరు పేలిపోవడంతో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డాక్టర్‌ కృష్ణ జగన్‌ అక్కడికక్కడే మరణించారు. బంగారుపేట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

### చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


వెంకటేష్‌ (ఫైల్‌)

బంగారుపాళెం : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందున్న వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు .. మండలంలోని బోడబండ్లకు చెందిన వెంకటేష్‌ (48) శనివారం ద్విచక్రవాహనంపై పలమనేరుకు వెళ్లి తిరిగివస్తుండగా పాలమాకులపల్లె పిళ్లారి గుండు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం చెన్నైలో ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య కామాక్షమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# కష్టాల ఖరీఫ్‌


వేరుశనగ విత్తేందుకు దుక్కి చేసిన భూమి

నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్‌ సీజన్‌కు శుభ శకునాలు కనిపిస్తున్నాయి. అయితే రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. సకాలంలో అవసరాలకు తగ్గట్టు విత్తనాలు అందక అవస్థలు పడుతున్నారు. అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కాకపోవడంతో పెట్టుబడి సాయం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కారు చేయూత కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే అదును తప్పుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అందని పెట్టుబడి సాయం
- విత్తన పంపిణీలో జాప్యం
- చేతికి రాని నష్టపరిహారం
- కనీస మాత్రం స్పందించని ప్రభుత్వం
- అదును తప్పుతుందనే ఆందోళనలో రైతాంగం

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): జిల్లాలో ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి వర్షాధార పంటగా వేరుశనగను సాగు చేస్తుంటారు. సకాలంలో వరుణుడు కరుణిస్తే ఏటా మే ఆరంభం నుంచే దుక్కులు చేపట్టి భూములను సిద్ధం చేసుకుంటారు. నిల్వ ఉంచిన కాయలను ఒబ్బిడి చేసి విత్తుకు సమాయత్తమవుతారు. లేకుంటే ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను కొనుగోలు చేసుకుని సన్నద్ధమవుతారు. జూన్‌ తొలివారంలోనే విత్తులు మొదలుపెడుతుంటారు. అయితే ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసినా ప్రయోజనం లేకుండా పోతోంది. రైతులు దుక్కులు పూర్తి చేసుకుని భూమిని సిద్ధం చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సాయం అందని దుస్థితి దాపురించింది. విత్తనాలు పంపిణీ చేయడంలో సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది.

**అన్నదాతపై భారం**

వేరుశనగ ఎకరాలో సాగు చేయాలంటే రూ. 20వేలకు పైగా ఖర్చు అవుతోంది. భూములను శుద్ధి చేయడానికి రూ. 2వేలు, ట్రాక్టర్‌ ద్వారా మూడు సార్లు దుక్కులకు రూ. 3వేలు, పశువుల ఎరువులు రెండు లోడ్‌లకు రూ. 8వేలు, వేరుశనగ విత్తనం మూడు బ్యాగులు (30కేజీలు) రూ. 6వేలు, విత్తు వేయడానికి రూ.1,200 ఖర్చు అవుతోంది. విత్తు తర్వాత రెండు సార్లు కలుపు తీయాల్సి ఉంది. ఈ క్రమంలో కలుపు తవ్వకాలకు రూ.5 వేల నుంచిరూ. 6వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. తర్వాత ఒబ్బిడి చేసేందుకు రూ. 5వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈవ్యయ భారం ఖరీఫ్‌ సీజన్‌లో రైతులను నిరాశపరుస్తోంది.

**ఏదీ సాయం**

గత ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట 13,044 హెక్టార్లల్లో సాగైంది. వరుణుడు కరుణించకపోవడంతో 9వేల హెక్టార్లల్లో పంట దెబ్బతింది. 24,342 మంది రైతులకు గాను రూ.15.42 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ఆ పరిహారం రైతులకు అందలేదు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ అమలు చేయలేదు. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పుడు హడావుడిగా అర్హుల జాబితాలంటూ వెరిఫికేషన్లు చేపట్టింది. అయితే ప్రక్రియంతా పూర్తయ్యి సొమ్ము ఖాతాల్లో జమయ్యే సరికి ఆదును వెళ్లిపోతుందేమో అన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. విత్తన పంపిణీలో జాప్యం జరుగుతోంది.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| ఖరీఫ్‌ సీజన్‌లో సాగు సాధారణ విస్తీర్ణం : | 71,305 |
| వేరుశనగ సాగు విస్తీర్ణం : | 35,238 |
| మొత్తం రైతుల సంఖ్య : | 1.80 లక్షలు |
| వేరుశనగ సాగు చేసేవారు సుమారు : | 90 వేలు |
| అవసరమైన విత్తనకాయలు : | 40,338 క్వింటాళ్లు |
| కేటాయించినవి: | 26,350 క్వింటాళ్లు |
| ఇప్పటి వరకు అందించినవి : | 15,016 క్వింటాళ్లు |

**భయంగా ఉంది**



వేరుశనగ పండించి ఏటా నష్టాలు తప్ప లాభం లేదు. వర్షానికి తీవ్రంగా నష్టపోతున్నాం. జగనన్న ఉన్నంత వరకు రైతు భరోసా ఇచ్చేవారు. ఆ డబ్బులతో భూములను దుక్కులు చేసి వేరుశనగ విత్తేవాళ్లం. ఈ సారి మాకు భరోసా లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. ఈవర్షాలను నమ్మి విత్తు వేయాలంటనే భయంగా ఉంది.
– మునస్వామి, రైతు, కొండ్రెడ్డిపల్లె, చిత్తూరు మండలం

**త్వరలో పంపిణీ చేస్తాం**



జిల్లాలోని పలు మండలాలకు వేరుశనగ విత్తన కాయలు సరఫరా అవుతున్నాయి. మూడు రోజుల్లో కేటాయింపు మేరకు కాయలు వస్తాయి. రాయితీ ధర వచ్చింది. త్వరలో కపంపిణీ ప్రారంభమవుతుంది. అన్నదాత సుఖీభవ ప్రక్రియ కొనసాగుతోంది. ఈసారి లక్ష్యం మేరకు వేరుశనగ సాగయ్యేలా చూస్తున్నాం.
– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు

### రీవాల్యుయేషన్‌లో అక్ర'మార్కు'లు'!



సాక్షి టాస్క్‌ఫోర్స్‌: ఎస్వీయూలో డిగ్రీ, పీజీ పరీక్ష పేపర్ల రీ–వాల్యువేషన్‌ ప్రక్రియలో జరుగుతున్న గోల్‌మాల్‌ను అధికారులు సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో వర్సిటీలోని కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డిగ్రీకి సంబంధించిన పలు పరీక్షా ఫలితాలపై సంతృప్తి చెందని విద్యార్థులు తమకు మార్కులు తక్కువ వచ్చాయంటూ వందల సంఖ్యలో రీవాల్యువేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇదే అవకాశంగా ఎగ్జామినేషన్‌ సెక్షన్‌లో పనిచేస్తున్న కొందరు ఎక్కువ మార్కులు వేయిస్తామంటూ వేలల్లో వసూలు చేస్తున్నారు. దీనిపై సాక్షాత్తు ఎగ్జామినేషన్‌ సెక్షన్‌లో పనిచేసే ఓ అధికారి వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం! ఇదే విషయంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కొన్ని సెమిస్టర్ల డిగ్రీ, పీజీ పరీక్ష పేపర్ల రీవాల్యువేషన్‌లో మళ్లీ తప్పులు దొర్లడంతో అధికారులకు అనుమానం వచ్చి ఉద్యోగులను నిలదీశారు. రీవాల్యువేషన్‌ చేసిన పేపర్లను తమ ముందు ఉంచాలని ఎగ్జామినేషన్‌ సెక్షన్‌ సిబ్బందిని నిలదీశారు. ఈ పరిస్థితిని ఊహించని ఎగ్జామినేషన్‌ సిబ్బంది కొందరు తెల్లముఖం వేసినట్లు తెలుస్తోంది.

# పొట్టకొట్టారు.. వీధిలోకి నెట్టారు!


ఎండీయూ వాహనాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆపరేటర్లు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

- ఎండీయూ ఆపరేటర్ల నిరసన

నగరి : బాబు వస్తే జాబు వస్తుందని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటించి ఇప్పుడు ఉన్నవాటికే ఎసరు పెడుతున్నారని ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉపాధి ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో సోమవారం పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయం వద్ద వాహనాలను నిలిపి నిరసన తెలిపారు. ఎండీయూ ఆపరేటర్ల యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 326 మంది ఆపరేటర్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ విధానంతో వందల కుటుంబాలు వీధిన పడ్డాయని వాపోయారు. రేషన్‌ దుకాణాల ఎదుట ప్రజలు పడిగాపులు కాయకుండా ఇంటి వద్దకే సరుకులు చేరుస్తున్న తమను కొనసాగించాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందనే కారణంతో జనాలకు ఉపయోగపడే ఎండీయూ వాహనాలను నిలిపివేయడం సరికాదన్నారు. వీటిని రద్దు చేసి తమ పొట్టకొట్టవద్దని విన్నవించారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్ర అందించారు.

**రోడ్డున పడే పరిస్థితి**



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాకు ఉద్యోగాలు ఇచ్చింది. ఇంటింటికీ వెళ్లి రేషన్‌ సరకులు అందించే పని అప్పగించింది. వాహనాలు బ్యాంకు రుణాల ద్వారా తీసుకుని ఇప్పటికీ ఈఎంఐలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు మమ్మల్ని నిలిపేస్తే రుణ వాయిదాలు కూడా చెల్లించలేం. దీంతో మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుంది.
– వేణు, జిల్లా అధ్యక్షుడు, ఎండీయూ యూనియన్‌

**వాహనమే జీవనాధారం**



ఎండీయూ వాహనం ద్వారా ఉపాధి పొందుతున్నాం. నాలుగేళ్ల నుంచి ఇదే నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ప్రతి నెలా 15వ తేదీ లోపు ఇంటింటికీ వెళ్లి సరుకుల పంపిణీ పూర్తి చేసేవాళ్లం. ప్రభుత్వం ఇప్పుడు ఈ వాహనాలను రద్దు చేయడంతో దిక్కుతోచని
– వీపీ శ్రీనివాసన్‌, జిల్లా ఉపాధ్యక్షులు, ఎండీయూ యూనియన్‌

# రమణీయం.. రథోత్సవం


రథంపై ఊరేగుతున్న దేవదేవేరులు

కార్వేటినగరం : శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం రమణీయంగా రథోత్సవం నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేతంగా స్వామి వారు దివ్య రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా వేకువజామునే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర చేపట్టారు. అనంతరం సర్వాలంకారభూషితులైన దేవదేవేరులను రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. భజన బృందాలు, కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మహిమాన్విత రథంపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు.


అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

సాయంత్రం కనులపండువగా ఊంజల్‌సేవ జరిపించారు. రాత్రి అశ్వవాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంట్‌ మునిశేఖర్‌, ఆలయాధికారి సురేష్‌కుమార్‌, షరాబ్‌ బాబుసురేష్‌, కంకణభట్టార్‌ తరుణ్‌కుమార్‌, వేదపండితులు నారాయణ దాశరి, గోపాలాచారి, శబరీష్‌, రమేష్‌, ధన్వంతరి, ప్రశాంత్‌ పాల్గొన్నారు.


**నేడు చక్రస్నానం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు రాజరాజేశ్వరీదేవి ఆలయ సమీపంలోని స్కంధ పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్‌ తెలిపారు. అలాగే పల్లకి ఉత్సవం, స్నపన తిరుమంజనం జరిపించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నట్లు వివరించారు.

### ట్రాక్టర్‌ చోరీ కేసులో నిందితుల అరెస్ట్‌

గుడిపాల : ట్రాక్టర్‌ చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్‌ చేశారు. నిందితుల నుంచి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గుడిపాల మండలం పానాటూరు వద్ద ఈ నెల 17వ తేదీన ఓ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ట్రాక్టర్‌ యజమాని బాలకృష్ణమనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన నితీష్‌(22), అవినాష్‌(30), మహమ్మద్‌భాషా(19)ను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

## తిరుమలలో విశేష పర్వదినాలు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూన్‌లో నిర్వహించనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. జూన్‌ 5న మెయిన్‌ వరదరాజస్వామి వర్ష తిరు నక్షత్రం, 9న శ్రీవారి జ్యేష్ఠాభిషేకం ప్రారంభం, నమ్మాళ్వార్‌ శాత్తుమొర, 11న శ్రీవారి జ్యేష్ఠాభిషేకం సమాప్తం, 21 స్మార్త ఏకాదశి, 22న వైష్ణవ మాధ్వ ఏకాదశి, 26న పెరియాళ్వార్‌ ఉత్సవారంభం ఉంటుందని వెల్లడించింది.

# అతీగతీ లేదని అర్జీదారుల ఆవేదన

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- వివిధ సమస్యలపై 266 వినతులు నమోదు


కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : ప్రతి వారం కలెక్టరేట్‌కు దూరాభారం నుంచి తరలివచ్చి వినతులు ఇస్తూనే ఉన్నాం.. అయితే అతీగతీ లేదని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పెద్దసంఖ్యలో జనం విచ్చేసి తమ సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మోహన్‌ కుమార్‌ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 266 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్‌ ఏవో కులశేఖర్‌ వెల్లడించారు.

### మేత భూమి కబ్జా

శ్రీరంగరాజపురం మండలం ఏఎం పురం ఆదిఆంధ్రవాడ, ఏఎం పురంలో పశువుల మేత భూమిని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కబ్జా చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. సర్వే నెంబర్‌ 170 లోని 18.02 ఎకరాల మేత భూమిని హరినాయుడు, రెడ్డెప్పనాయుడు, నరసింహులు, రోహిత్‌ దొంగ పట్టాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారన్నారు. దీనిపై నెల క్రితం ఉన్నతాధికారులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ స్పందించి మేత భూమిని కాపాడాలని కోరారు.


నిరసన తెలుపుతూ.. వినతిని చూపుతున్న ఎస్‌ఆర్‌పురం వాసులు

### ఉద్యోగం ఇప్పించండి



ఎలాంటి జీవనాధారం లేని తనకు ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగం ఇప్పించాలని పెద్దపంజాణి మండలం చిన్నముద్దేపల్లెకు చెందిన శారద అనే మహిళ విన్నవించారు. తనకు 5 ఏళ్ల పాప, 20 నెలల బాబు ఉన్నారని, భర్త నుంచి ఎలాంటి ఆదరణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టపోషణ కూడా కష్టంగా ఉందని, అధికారులు స్పందించి సాయం చేయాలని కోరారు. పదోతరగతి వరకు చదువుకున్నానని, చిన్నపాటి ఉద్యోగమైనా ఇప్పించి ఆదుకోవాలని పేర్కొన్నారు.

### పింఛన్‌ ఇప్పించండి



పింఛన్‌ కోసం పలు మార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని బైరెడ్డిపల్లె మండలం చలగపల్లెకు చెందిన మునస్వామి అనే వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు 85 ఏళ్లు దాటుతున్నాయని, అయితే ఇప్పటి వరకు పింఛన్‌ రాలేదని వాపోయారు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఒంటరిగా మిగిలిపోయిన తనకు పింఛన్‌ మంజూరు చేయించి జీవనాధారం కల్పించాలని విన్నవించారు.